# శివయ్య గ్రామసేవ

పనిమీద ఆ గ్రామంవచ్చిన శివయ్య నిండా ఇరవై ఏళ్ళులేని విద్యార్థి.

ఆ గ్రామంలో పరుగులుతీసే కృష్ణానది కాలువలో గొడ్లనుకాసే పిల్లలతో పందెంవేసుకుని గంటనుంచీ ఈతకొట్టి అలిసిపోయాడు. అప్పటికి సూర్యుడి లేత కిరణాలు ముదరటం మొదలుపెట్టాయి.

గొడ్లనుకాసే పిల్లలు వాటిని అవతలిగట్టుకు తోలుకువెళ్ళారు. శివయ్య ఆరవేసుకున్న లుంగీ కట్టుకుని మిగతాబట్టలు ఉతికి ఒడ్డున ఆరవేసుకున్నాడు. ఒడ్డునఉన్న చెట్టుక్రింద కూర్చుని సంచీలో పొట్లంకట్టి తెచ్చుకున్న రెండురొట్టెలు తిని మంచినీళ్ళు తాగాడు. బట్టలు ఎండేవరకూ దేశభక్తి గీతాలు పాడుకుంటూ కాలువ ఒడ్డునే తిరుగుతున్నాడు.

ఆ గ్రామంలో సన్నకారు రైతులు ఆ దారినపోతూ "సామీ తమదేఊరు ?" అడిగారు. కొత్తవాళ్ళను చూడగానే అలా అడిగే అలవాటువాళ్ళకు. అదీగాక ఈ మధ్య కొత్తమనిషిని చూడగానే భయంగాకూడా ఉంటోంది.

"మాది అటువైపుగ్రామం. ఊరికేనే ఇక్కడికి వచ్చాను. రెండురోజులయింది. నాతో తెచ్చుకున్న రొట్టెలుతిని ఈ చెట్టుకింద ఉంటున్నాను. మీ గ్రామస్తులు కొందరు నిన్నవచ్చి చాలాసేపు కూచున్నారు. వాళ్ళకు సాయంత్రం వరకూ ఏవోకబుర్లు చెప్పాను. ఇక్కడి సంగతులన్నీ చెప్పారు. నిన్న మీరు రాలేదా ?" అడిగాడు శివయ్య.

"లేదుసామీ, మేము ఊళ్ళోకి పనిమీదవెళ్లాం. వీడిపేరు రామిగాడు. మా అత్తమ్మకొడుకు. వాడి భూమి బీడుపడిపోయింది. తినటానికి గింజలులేవు. కట్టుకున్నదాన్ని తీసుకుని మా యింటికి వచ్చినాడు పొద్దుగలనే. నేనేంజేతుసామీ ? మాకే తిండిగడుస్తలేదు, ఊళ్లోకి తీసుకుపోతున్న. ఏదయిన పనిదొరుకుతుందేమోనని."

శివయ్య వచ్చిన రెండురోజుల్లో ఆ వాడగుడిసెలలో ఉన్నవాళ్ళను కొందరిని కలుసుకున్నాడు. ఆ ఊళ్ళో ఇటీవలజరిగిన దొమ్మినిగురించి కొందరు చెప్పారు. అక్కడివాళ్ళకు ఏంచెయ్యాలో తోచక ఒకరికొకరు సంప్రతించుకుంటూ తిరుగుతున్నారు. వాళ్ళను తనముందు కూచోబెట్టుకుని మాట్లాడుతూ మంచిచేసుకుందామని మధ్యాహ్నం మూడుగంటలవేళ కబుర్లుచెప్పటం మొదలుపెట్టాడు. వాళ్ళకు అర్థమయ్యేభాషలో వాళ్ళకు నిత్యానుభవమున్న పిట్టకథలు చెప్పి ఆకర్షించాడు. కొందరు పాలుతెచ్చియిస్తే తీసుకున్నాడు.

"అయితే నీభూమి మొదటినుంచీ బీడుపడే ఉన్నదా ?" అడిగాడు శివయ్య తనతో మాట్లాడిన సన్నకారురైతును.

"లేదు సామీ, నాలుగురోజులాయె. పంటకొచ్చిన చేను ఒకరాత్రికాడ ఎవరో మంటపెట్టారు. మాకు తిండికి గింజలులేకుండ పోయాయి."

"అయితే ఇప్పుడేం చేస్తున్నావు ?"

"మా బావదగ్గరకొచ్చిన ఏం చెప్తడోనని."

"ఆ భూమి దున్ని ఉంచుకో, చినుకుపడగానే గింజలు చల్లుకోవచ్చు."

"ఇప్పుడు గింజలేస్తే పంటొస్తుందా సామీ? అంతవరకూ ఉపవాసాలుండాలి కదా" విచారంతో ముఖం ముడుచుకుపోయింది అతడికి.

"ఈలోపల ఏదయినా పనిచేసుకో"

"ఎవరిస్తరు సామీ పని ? ఈ మద్దెన ఏపుగా పెరిగిన చేలు తగలబడిపోయినాయి. కొన్ని గుడిసెలు కాలిపోయాయి. పిల్లలు ముసలివాళ్ళు చాలామంది మంటల్లో కాలిపోయారు. కొందరు ఊరుదాటిపోయారు."

"ఒళ్ళు కాలినవాళ్ళంతా చచ్చిపోయారా ?"

పోయినవాళ్ళు పోగా కొందరు అటూ ఇటూ కాకుండఉన్నారు. ఇక్కడ మందులిచ్చేవోళ్లు కూడా సరిగలేరు."

"అంత బీభత్సం జరిగిందా ? మీ ఊరు నాకు చూపించు" కాలినడకన ఆ గ్రామంవెళ్ళి చూశాడు శివయ్య.

వాళ్ళు చెప్పినదానికంటె ఘోరంగా ఉంది. గడ్డివాములు తగలబడి పోయాయి. కొన్ని పశువులు తాళ్ళుతెంచుకుని పారిపోయాయి. కొన్ని చచ్చిపడు న్నాయి. కొన్ని గుడిసెలు పైకప్పులు కాలిపోయి మొండిగోడలతో నిలిచాయి.

శివయ్య ఒళ్ళుకాలినవాళ్ళను చూశాడు. తన దగ్గరున్న మందులు సంచీలో ఉన్నవితీసి పైపూత పూశాడు. ఒక గుడిసెలో ఇంటికప్పు కాలిపోయింది. మొండి గోడలమధ్యన ముసలితండ్రిని కనిపెట్టుకుని కొడుకున్నాడు. గంజి కాచుకుని తాగుతున్నారు.

"నీకు తిండిగింజలెక్కడివి?"

"నేలలోపల రెండుబస్తాల జొన్నలు పాతరేశాను బాబూ ''

"నీ భార్యాపిల్లలు ఏరీ ?"

"అడదాన్ని పురిటికి పంపిన, ఆ ఊరు దూరానఉంది."

"మరి నీవు గుడిసెకప్పుకోవా ? ఎండకూ వానకూ ఈ ముసలివాడిని ఆరు బయట ఉంచుతావా?"

"ఏంచెప్పను సామీ? పిలిస్తే ఏఒక్కరు రారు. తోడులేనిది ఈపని కాదు. నాయనకు ఒంటినిండ ఉన్న ఒక్కబట్ట కప్పుతున్న. కాచుకున్న గంజిని ఇద్దరం తాగుతున్నం.''

''చూడు మేమిద్దరం నీకు సాయంచేస్తాం. వాసాలు తెచ్చుకో. పైన కప్ప టానికి కూడా ఏమయినా తీసుకురా ''

"సామీ, మీరెవరు ? నాకింత సాయితా చేస్తానంటున్నారు ?" ఆ మెత్తటి మాటలకు శివయ్య కాళ్ళమీద పడ్డాడు ఆ గుడిసె ఆసామి.

"ఎవరయితేనేం? పోయి కావలసినవి ఏరుకొచ్చుకో"

శివయ్యతో కూడా వచ్చిన రామిగాడి సహాయంతో ఆకులుకాలిన తాటి చెట్లను మొదట్లోకినరికి గుంజుకువచ్చారిద్దరూ. గొడ్డలితో దానిని వాసాలుగా పగలగొట్టారు. మొండిగోడలమీద వాటిని అడ్డంగా నిలువుగా వేశారు. చెట్ల కొమ్మలునరికి వాటిమీద కప్పారు. దానికి గుడిసె ఆకారం వచ్చింది. ఎంత సర్దినా సందులేర్పడ్డాయి.

"ఇతడికి తినటానికి తిండిగింజలులేవు. తిండితిని ఎన్నాళ్ళయిందో? నాతోకూడావచ్చాడు. నీకు గుడిసెకప్పాడుకదా? అతడికి ఏమయినా ఇవ్వవా?" శివయ్య అడిగాడు.

"సామీ నాతాన పైకంలేదు. జొన్నగింజలుతప్ప."

"అవే రెండుగొట్టాలివ్వు. అప్పటినుంచీ కష్టపడ్డాడు. ముందు ఇంత గంజి కాచిపొయ్యి మీతోబాటు."

"సామీ, మీరు?"

"నేనూ అదే తాగుతాను. నీలాంటిమనిషినేగా?"

రామిగాడు పుల్లలేరుకువచ్చాడు. పొయ్యివెలిగించి మంటచేశాడు. ఆసామి జొన్నలుతొక్కి కుండతోఎసరు పెట్టి అన్నంవండాడు. ఆ ఊరివాళ్ళు చింతాకుపొడి తయారుచేసుకుని కుండలతో భద్రపరచుకుంటారు. ఆ పొడి తలాకొంచెంవేసుకుని తిన్నారు. ఆ దగ్గర్లోఉన్న బావినీళ్ళుతోడుకుని దోసెళ్ళతోతాగారు. రామిగాడు ఆసామియిచ్చిన జొన్నలు పంచలోకట్టుకున్నాడు.

"సామీ, నాగుడిసెను నిలబెట్టారు భగవంతుడిలావచ్చి" అంటూ దణ్ణం పెట్టాడు గుడిసె ఆసామి.

"చూడు - నీగుడిసెలా తగలబడ్డగుడిసెలు ఇంకా ఎన్ని ఉన్నాయి?" అడిగాడు శివయ్య. అంతమాత్రం తనతో బాగా మాట్లాడినందుకు అతడికి ఆనందంకలిగింది.

"పదిండ్లకుపైగా కాలిపోయాయి. కొన్ని కాలగానే ఊరంత గొల్లునలేచి నీళ్ళుపోసి ఆర్పుకున్నారు."

"ఎవరు ఈపనిచేసింది? ఈ ఊరివాళ్ళేనా?"

"కాదుసామి, ఒక రాత్రివేళ ఒక గుంపువచ్చి గుడిసెలకు నిప్పుపెట్టింది. ఆ గుంపులో కొందరు పంటగింజలు మూటలుకట్టుకున్నారు. కొందరు పంటచేలు కోసినంతకోసి తొక్కి పాడుచేశారు. చీకటిపూట ఊరిమీదపడ్డారు. ఊరంత ఒక్కటై - కర్రలతో వాళ్ళను తరిమికొట్టారు. చాలామందికి దెబ్బలుతగిలి పడిపోయారు.

"గుడిసెలు కాలిపోయాయంటున్నావు. వాళ్ళంతా మళ్ళీ గుడిసెలు బాగు చేసుకున్నారా?"

"చేసుకుంటున్నారు తోడుకావాలి. పిలిస్తే పలికేదిక్కు కావాలిసామీ. ఊళ్ళో ఒకడంటే ఇంకోడికిపడదు."

శివయ్య ఆసామి చూపించిన దిశగావెళ్ళి రామిగాడి సహాయంతో ఆరోజుకు మూడుగుడిసెలు బాగుచెయ్యగలిగాడు. ఆరాత్రికి ఒక చెట్టుకింద ఇద్దరూ ముడుచుకుని పడుకున్నారు.

శివయ్య తన అలవాటుచొప్పున తెల్లవారకముందేలేచి స్నానంచేసి బట్టలు ఉతుక్కున్నాడు. లేతఎండలో వెంటతెచ్చుకున్న పుస్తకం చదువుకుంటూ కూచున్నాడు.

అంతలో శివయ్యతోకూడావచ్చిన రామిగాడువచ్చి ఎదురుగా నిలిచాడు.

"నీవు ఊళ్ళోకివెళ్ళి ఊరివాళ్ళనందరినీ పిలుచుకు రాగలవా?"

రామిగాడువెళ్ళి అడగగానే—

"ఎందుకు? ఆడెవరంట రమ్మనటానికి? ఏగుంపులో చేరినోడు?" కొందరు ప్రశ్నించారు కొత్తవాడిని చూడగానే.

"గుంపుకాదు నిన్న మేము కాలిపోయినగుడిసెలను కప్పలేసి బాగుచేశాము. నాతోకూడావచ్చిన సామి మంచోడు. మేమిద్దరం గుడిసెలకు తాటివాసాలువేసి చెట్లకొమ్మలునరికి బాగుచేసినాంకదా? ఆయన మీతో మాట్లాడాలంటున్నాడు. మీకుతోడ్పడతాడు" శివయ్య మంచితనాన్నిగురించి మరీమరీ చెప్పాడు రామిగాడు.

కొందరు అతడి మాటలనునమ్మి చూడాలనివచ్చారు.

"మీరందరూ గుడిసెలు బాగుచేసుకున్నారా? చాలా కాలిపోయాయటకదా? పంటచేలుకూడా పాడయిపోయాయని విన్నాను?" వాళ్ళను కూర్చోమనిచెప్పి ఆదరంతో అడిగాడు శివయ్య.

"ఒకళ్ళిద్దరు బాగుచేసుకున్నారు. మనిషితోడుండాలె. తాటివాసాలుదొరకాలి. చూస్తున్నాం సామీ" శివయ్యమాటలకే వాళ్ళకష్టాలు తొలిగిపోయినట్టుగా సంబరపడ్డారు.

"ఇతడి పేరు రామయ్య. మీకు సహాయంచేస్తాడు. పనిచేయించుకుని అతడి కేమయినా తలాకొంచెంఇవ్వండి. అతడూ మీలా కష్టపడ్డవాడే. అతడికికూడా మీతోబాటు ఇంత గంజికాచిపొయ్యండి. మీ సంగతివిని సహాయంచెయ్యటానికే నేను కూడా వచ్చాను. దారిలో ఇతడుకలిస్తే నా వెంట తీసుకువచ్చాను."

శివయ్య మాటలువినగానే వాళ్ళకు ధైర్యంవచ్చింది. అనుమానాలన్నీ తొలగిపోయాయి అందరూ అతడిఎదుట చేతులుకట్టుకుని కూర్చున్నారు.

"మీ పిల్లలేంచేస్తున్నారు?"

"కొంతమందికి ఒళ్ళుకాలింది. మిగిలినోళ్ళు ఊరుపట్టుకుని తిరుగుతున్నారు. చిన్నపిల్లలుకూడా అళ్ళఎంబడే ఉన్నారు."

''వాళ్ళను పిలవండి'' శివయ్య వచ్చేటప్పుడు కొన్ని మందులు సంచిలో వేసుకునివచ్చాడు.

పిల్లలను చూడగానే శివయ్యకు కడుపులో తిప్పినట్టయింది. గాయపడిన పిల్లలకు మందు రాయించాడు. పిల్లలకు ఒంటిమీద గోచీగుడ్డతప్ప ఏమిలేదు. ఒళ్ళంతా మట్టికొట్టుకు పోయినట్టుంది. స్నానాలమాటే ఎరగనట్టున్నారు. ముఖాల మీద ఈగలు ముసురుతున్నాయి.

శివయ్య వాళ్ళనందరినీ బావిదగ్గరకు పంపించి ముఖాలూ కాళ్ళూ చేతులూ కడుక్కురమ్మన్నాడు. వాళ్ళురాగానే "మీరందరూ గంజితాగిరండి. నేనిక్కడే ఉంటాను. మీ పెద్దవాళ్ళు చెట్లకొమ్మలుకొట్టి కిందపడేస్తారు. మీరంతా వాటిని మీగుడిసెలదగ్గరికి గుంజుకుపోండి. పెద్దవాళ్ళు గోడలమీదికి వాసాలుఎక్కిస్తుంటే మీరు కొమ్మలు అందించాలి. మధ్యాహ్నానికల్లా అపని అయిపోవాలి. చేస్తారా? ఎంతసేపుచేస్తారు? ఆడుతూపాడుతూ చిటికెలోచేస్తారు. చూద్దాం ఎట్లాచేస్తారో? వెళ్ళండి" అన్నాడు వాళ్ళను ఉత్సాహపరుస్తూ.

శివయ్య మాటలకు వాళ్ళకు ఉత్సాహంకలిగింది. పెద్దవాళ్ళకు సహాయం చెయ్యటానికి పరుగులుతీశారు. మధ్యాహ్నంకాగానే గంజితాగి మళ్ళీ పని మొదలు పెట్టారు. ఆ సాయంత్రానికల్లా గుడిసెలకు ఒక ఆకారంఏర్పడ్డది. వాళ్ళతోపాటు రామయ్యకింత గంజిపోశారు. గొడ్లుకలవాళ్ళు శివయ్యకు పాలుకాచి ముంతలో తెచ్చారు. ఆకలిగొన్న శివయ్య ఆ పాలు అపురూపురుమంటూ తాగాడు.

"మేమిక్కడే పడుకుంటాము. రేపు పొద్దున గుడిసెలముందర ఊడ్చి బాగుచేసుకుని గంజితాగి రండి. మిమ్మల్నందరినీ చూస్తే నాకు సంతోషంగా ఉంది. మనం కలుసుకుని మాట్లాడుకుందాం".

సరేనంటూ దణ్ణాలుపెట్టి మరునాడు గంజితాగి అందరూ పిల్లలతో వచ్చారు. అందరినీ కూర్చోబెట్టి కుశలప్రశ్నలువేసి పరామర్శచేసి వాళ్ళందరికీ పురాణకథలుచెప్పాడు. అందరూ సంబరంతో విన్నారు. కొందరు ప్రశ్నలు వేశారు. తెలియనివి అడిగి తెలుసుకున్నారు.

"మీరు రోజూ ఇట్లా కతలుచెప్తారా సామీ "? అడిగారు కొందరు. మరి కొందరికి ఇంకా ఇంకా వినాలనే ఉందిగాని చీకటిపడగానే కల్లుతాగే అలవాటు కనుక లేచివెళ్ళారు రామయ్యను తీసుకుని, ఆ రాత్రికి కూడా పాలు పంపించారు శివయ్యకు.

ఆ గ్రామంలో ఉన్న గుడిసెలు చాలా తక్కువ, ఇద్దరు ముగ్గురికి మాత్రమే అరఎకరం, పావుఎకరం భూమి ఉంది. జొన్నలు తప్ప మరేమీ పండవు. కొందరు పక్కగ్రామంలో పెద్దరైతుల పొలాలలో పనిచేస్తారు. గొడ్లను మేపుతారు. రాత్రిళ్ళు ఇళ్ళకువస్తారు. పనిచెయ్యలేనివాళ్ళు, భూమిగలవాళ్ళు పిల్లలూ గ్రామంలో ఉండి ఇంటిపని చేసుకుంటారు. ఇది జరిగిన కాలంలో ఆ గ్రామంలో వాళ్ళకు చేతినిండా పనిలేదు. కూలీపనులులేవు. ఆడవాళ్ళు ఇళ్ళల్లోనే ఉంటున్నారు.

తెల్లవారి తొమ్మిది పదిగంటలకు స్వల్పసంఖ్యలో వచ్చారుజనం. శివయ్య కెదురుగా కూర్చున్నారు.

"సామీ కతచెప్తారా ?" కుతూహలంతో అడిగారు.

"మీరు వింటానంటే చెప్తాను. మీతో కొంచెం ముందు మాట్లాడాలి. మీగుడిసెలచుట్టూ మురుగు కాలవలూ ఈగలూ దోమలూ ఉన్నాయి. "చూశారా"?

"అవుసామీ కుక్కలూ పందులూ ఆ మురికినంతా చిందగొట్టి గుడిసెల చుట్టూ బురద బురదగా చేస్తాయి. కొడితేపోవు." అన్నారు ఇద్దరు ముగ్గురు.

ఈ మురికినీళ్ళు దూరంగా పోవటానికి లోతుగా కాలవ తవ్వండి. ఆ నీళ్ల

అటుపోతాయి. మీ గుడిసెలకు దూరంగా మురికినీళ్ళు ఉంటే దోమలూ ఈగలు కూడా దూరంగా ఉంటాయి. ఇద్దరు మనుష్యులు పారలు తీసుకుంటే రెండు రోజులుకూడా పట్టదు. మంచి కూరగాయల విత్తనాలు తెచ్చి పాదులు గుడిసెల మీదికి ఎక్కించండి. కూరలమ్మితే డబ్బులొస్తాయి. మీ అదృష్టం - మీకోబావి ఉంది. అక్కడ ఆకుకూరల మడులుపెట్టి బావిలోనుంచి నీళ్ళు తోడిపొయ్యండి. ఎదిగిన తరువాత మీరూ వండుకోండి. పక్కఊళ్లో అమ్మితే పైసలొస్తాయి. బట్టలు కొనుక్కోవచ్చు. మీ పిల్లలకు ఒంటినిండా బట్టలు లేవు చూశారా ?"

అవునన్నట్టు అందరూ తలలూపారు.

"పిల్లలు ఊరికే తిరిగి చెడిపోతున్నారు. నేను అక్షరాలూ అంకెలు నేర్పుతాను. పెద్దవాళ్ళు కూడా తీరిక ఉన్నప్పుడురండి. మీరు బాగా నేర్చుకుంటే ఒక పంతుల్ని తీసుకొస్తాను. ఏమంటారు ?" వాళ్ళందరి ముఖాలూ చూశాడు.

అందరూ 'మాకిష్టమే. నేర్చుకుంటామని' లేచి చెప్పారు.

శివయ్య వాళ్ళందరికీ ఆసక్తికలిగే కథలూ గాథలు చెప్పాడు.

ముందు పౌరాణికకథలుచెప్పి, తరువాత ఇసకమీద అక్షరాలు అంకెలూ రాయించటం మొదలుపెట్టాడు.

"దీనితోపాటు మీ ఊరిని శుభ్రంగా ఉంచుకోవటం నేను చెప్పినట్టు కూరగాయలు పండించటం మర్చిపోవద్దు. మీరంతా పట్నంలో ఉన్నట్టుండాలి శుభ్రంగా". అని అందరిచేత వాగ్దానాలు చేయించాడు.

వాళ్ళకూ ఈ పద్ధతి నచ్చినట్టుంది. ఆ పనిచేస్తున్నారు. పురాణకథలు వింటున్నారు. కొన్నినీతులూ ధర్మాలూ నేర్చుకుంటున్నారు.

శివయ్య ఉత్తరం వ్రాసి ఒకపంతుల్ని పిలిపించాడు. "అతడికి జీతం ప్రభుత్వం ఇస్తుంది. మీరు ఇంటికి జాగా ఇవ్వండి ఇల్లు కట్టుకుంటాడు. మీరు అందరూ కూర్చోటానికి ఒక చావడిలాగ కట్టండి. దాంట్లో చదువుకోండి."

శివయ్య అందరికీ చెప్పవలసినదంతా చెప్పి, "నేను పదిరోజులలో వస్తాను. ఇంకో గ్రామానికి పోవాలి. నేను వచ్చేవరకూ అందరూ నేను చెప్పినట్టే నడుచుకోవాలి" అన్నాడు.

అందరూ తలలూపారు. పదిరోజుల తరువాత శివయ్యవచ్చి చూసినప్పుడు ఆ ఊరివాళ్ళు అతడిమాటలు మీరకుండా నడుచుకోవటంచూసి సంతోషించి మళ్ళీ బయలుదేరాడు. ఆ విధంగా శివయ్య నాలుగైదు గ్రామాలు తను అనుకున్నట్టుగా రూపొందించాడు రామయ్య సహాయంతో.

గ్రామప్రజల నుద్దేశించి ఒకరోజు "నాతోపాటుగా ఈ రామయ్య మీ అందరి కోసం పనిచేస్తున్నాడు. పేదవాడు. తిండికి గింజలులేక భార్యను ఊరికి పంపించి నాతో వచ్చాడు. మీరందరూ మీకు తోచినంత గుడిసెకింత అని ఇవ్వండి. ఇంటికివెళ్ళి భార్యను చూసివస్తాడు" అని అర్థించాడు శివయ్య.

ప్రతి గ్రామంలోను గుడిసెకిన్ని జొన్నలు రామయ్య సంచిలోపోశారు. అన్నీ కలిపి అరబస్తాడయ్యాయి. భార్యదగ్గరికి జొన్నలు తీసుకుని బయలుదేరి వెళ్ళాడు రామయ్య.

శివయ్య తను తిరిగిన గ్రామాలను పదిరోజులకొకసారివెళ్ళి చూసి వస్తున్నాడు. అన్ని గ్రామాలలోనూ టీచర్లను పిలిపించి పెట్టించాడు.

"మరి నేను ఊరికి వెళ్ళొస్తాను. నన్ను మళ్ళీ రమ్మంటారా లేదా" అడిగాడు ప్రతిగ్రామంలోని వాళ్ళను.

"సామీ, మీరు వచ్చినసంది మాకు సొర్గంలో ఉన్నట్టుంది. మీ కతలు వింటే రాత్రివేళ కలలొస్తున్నాయి. సామీ మీరు భగమంతులు. మళ్ళీరావాల" అందరూచేతులెత్తి మొక్కారు.

శివయ్యకూడా పల్లెలోపుట్టి పల్లెలో పెరిగినవాడే. దుమ్ములోదొర్లి బురదలో మునిగి శుచీ శుభ్రత ఎరగనివాడే. ఒకనాడు తండ్రిమీద కోపంవచ్చి ఇంటినుంచి వెళ్ళిపోయాడు. పట్నంచేరుకుని, గుడిముందర పేదపిల్లలకు సాయంత్రపువేళల్లో చదువుచెప్పే పంతులును ఆశ్రయించాడు.

ఆయన తన యింటిపనులు చేయించుకుని శివయ్యకు చదువుచెప్పేవాడు. పాఠశాల మూసిన తరువాత గుడిలో పురాణంచెప్పేవాడు. ఆ సమయంలో కూడా శివయ్య ఆయన పక్కన కూర్చుని పురాణం వింటూ ఆయనకు విసనకర్రతో విసురుతూ ఉండేవాడు. అలా ఆ పండితుడికి సేవచేసినందుకు శివయ్యమీద పుత్రవాత్సల్యం పెరిగింది.

"ఒరే శివా ! నాకు ఊరికే పనిచేశానని అనుకోకు. నిన్ను స్కూల్లో చేర్పిస్తా, చందాలువేయించి నలుగురిచేత డబ్బుయిప్పిస్తా. నీవు పెద్దచదువులు చదివి పెద్ద ఉద్యోగం చెయ్యాలి. నీవంటి వాళ్ళను పైకి తీసుకురావాలి" అనే వాడు.

ఆ మాటలువిన్న శివయ్య మనసు స్వర్గపుటంచులవరకూ పయనించేది.

పంతులుగారి శ్రమా శివయ్యకృషీ రెండూకలిసి అతడిని హైస్కూలు దాటించాయి. కళాశాలలో చేర్పించాడు పంతులుగారు. అక్కడ మంచి విద్యార్థి అనిపించుకున్నాడు. ప్రాణమిచ్చే స్నేహితులు లభించారు నలుగురయిదుగురు.

సెలవు లిచ్చేముందర ప్రిన్సిపల్ విద్యార్థులనందరినీ సమావేశపరిచాడు.

"ఈ సెలవుల్లో మీరు వృథాగా ఇటూ అటూ తిరగకుండా గ్రామాలకు వెళ్ళి ప్రజాసేవచెయ్యాలి. మనం మన గ్రామాలను బాగుచేసుకుంటేగాని దేశాన్ని బాగుచెయ్యలేం. మీకు కూడా దేశాన్ని బాగుచెయ్యటంలో బాధ్యత ఉన్నది. నేను ఒక పథకం విద్యార్థులకోసం తయారుచేశాను. ఈ పథకంప్రకారం సేవచేసిన వారికి నేను స్కాలర్‌షిప్పులు ఇప్పిస్తాను. మీ ముందు చదువులకు మీ సేవా భావం ఉపయోగపడుతుంది" అంటూ ఉద్రేకపూరితమైన ఉపన్యాసం ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించాడు.

అట్లా బయలుదేరిన వాళ్ళల్లో శివయ్య, కామేశం, సోమన్న ఉన్నారు. వీళ్ళు ముగ్గురూ చేస్తామన్నపని దీక్షతో చేసి చూపించేవాళ్ళు. ముగ్గురూ మూడు మార్గాలు చేపట్టి గ్రామాలకు వెళ్ళారు.

మళ్ళీ కళాశాల తెరిచిననాడు ప్రిన్సిపల్‌కి కామేశం, సోమన్న కన బడ్డారు - కాని శివయ్య కనబడలేదు.

"మీతో బయలుదేరిన శివయ్యఏడీ ? మీరందరూ ఏమేంచేశారో నాకు చెప్పండి" ప్రిన్సిపల్ వాళ్ళను పలకరించి శివయ్యను గురించి ఆతురతతో అడిగాడు.

వాళ్ళు జవాబు చెప్పకుండా తలలు వంచుకున్నారు.

"ఏమయ్యాడు శివయ్య ? వెళ్ళినవాళ్ళంతా తిరిగి వచ్చేరోజులు వచ్చాయి కదా ?" ప్రిన్సిపల్ వాళ్ళను నిలవదీశాడు.

"అందరం కలిసిరావాలనే అనుకున్నాం సర్. దూరం వెళ్ళినవాళ్ళు రేపో ఎల్లుండో రావచ్చు" అన్నారు.

"మరి మీముగ్గురూ ఒకదిశకు వెళ్ళారుకదా? శివయ్యను కలిశారా వచ్చేటప్పుడు ?"

"కలిశాం సర్. మాకంటె శివయ్యే ఎక్కువ పనిచేశాడని మేము వెళ్ళినప్పుడు అక్కడివాళ్ళు చెప్పారు."

"సరే మరి మీతో ఎందుకురాలేదు ?"

"మేమతడిని కలుసుకుని తిరిగివస్తుండగా మాకొకగుంపు ఎదురయింది సర్. మాముగ్గురిలో శివయ్యనుచూసి "వీడే ఊళ్ళల్లో జొరబడి గుడిసెలన్నీ కప్పించి చదువట ! చదువు చెప్తున్నాడు. రోజూ ఊరందరినీ పోగేసి కతలు చెప్తున్నడట. ఏంకతలో ? ఈణ్ణి పోనియ్యకండి పట్టుకోండి" అని అరిచాడు. మిగతావాళ్ళు పరుగెత్తుతున్న మమ్మల్ని పట్టుకోవాలని ముందుకువస్తున్నారు.

మేము వాళ్ళనుచూసి వెనక్కు పరుగెత్తాం సర్. వాళ్ళచేతికి శివయ్య చిక్కాడు. కొంతదూరం పరుగెత్తి వెనక్కుతిరిగిచూస్తే ఆ గుంపు పక్కకు మళ్ళినట్టుంది. కనబడలేదు. సోమన్న వెనక్కుమళ్ళి చూద్దామన్నాడు. ఇద్దరం వెనక్కుమళ్ళి పరుగెత్తాం. ఒకచెట్టుకింద శివయ్యను బాగా కొట్టిపడేసి వాళ్ళు వెళ్ళిపోయినట్టున్నారు. శివయ్యకు ఒంటిమీద స్పృహలేదు. రక్తంకారుతున్నది. అతడిని మేమిద్దరం ఒక గుడిసెలోకి మోసుకుపోయాం. అక్కడ ఒళ్ళంత బట్టతో తుడిచి గ్లాసెడుపాలడిగి గొంతులోపోసి కదిపితే కదల్లేదు. పోసినపాలు పెదవులగుండా కారి బయటికి వచ్చాయి. అక్కడ బండ్లులేవు. మేము ఎత్తుకుని తీసుకురాలేకపోయాం సర్. ఆ ఊరివాళ్ళను అతడిని కనిపెట్టిచూడమని వచ్చాం. ఏదయినా బండీ తీసుకుపోతే గాని శివయ్యరాలేడు" అన్నారు.

"అట్లా చెప్తారేం ? చేతగానివాళ్ళు. పదండి ఒకబండీ తీసుకుపోదాం." ప్రిన్సిపల్ అనగానే ఇద్దరు టీచర్లు బయలుదేరారు వాళ్ళిద్దరినీ తీసుకుని దారిలో

దొరికిన బండిలో ఎక్కి పరుగెత్తించి శివయ్యనుంచిన గ్రామానికివెళ్ళారు. శివయ్య అట్లాగే పడున్నాడు. అతణ్ణి ఎత్తుకుని బండిమీద తీసుకువచ్చారు.

"ఏమయింది శివయ్యకు" ప్రిన్సిపల్ ముందుకువచ్చాడు అరుస్తూ.

వాళ్ళు మౌనం వహించారు.

రాత్రి పదిగంటలు దాటింది. ప్రిన్సిపల్ ఒకడాక్టర్ని పిలిపించాడు.

"లాభంలేదండి. మెడమీద తలమీద బలమైన కర్రదెబ్బలు తగిలాయి. ప్రాణమెప్పుడో పోయింది." అన్నాడు డాక్టరు.

ఆ రాత్రివేళ అక్కడున్న నలుగురూ శివయ్యను బండిలోనుంచి దింపి బల్లమీద పడుకోబెట్టారు. పదిమందీ పోగయ్యారు.

అందరూ తలాఒకమాట మాట్లాడారు.

తుపాకులతో వెళ్ళినవాళ్ళే శవాలుగా మారిపోయి పడిపోతుంటే ఈ పిల్లలు ప్రాణాలతో తిరిగివస్తారనే పంపించారా ? చేతిలో ఉన్నారని పంపించటం తప్పు?"

సోమన్న, కామేశం శరీరాలమీద దెబ్బలుచూసి కంటతడిపెట్టారు కొందరు. పెద్దగా ఏడ్చారు కొందరు.

అర్ధరాత్రివేళ ఏడుపులు- అరుపులు జనం పోగయ్యారు.

"ఈ శివయ్యను చూడండి. ఎంతబాగా చదువుకునేవాడు ? ఎంతమంచివాడు ? తోటివాళ్ళకు ఎంతసహాయం చేసేనాడు ? అక్కడ గ్రామాలలో పడిపోయిన ఇళ్ళను బాగుచేశాడట. ప్రజలను ప్రబోధవాక్యాలతో మంచినీ నీతినీ బోధించాడట. అతడే బ్రతికిఉంటే బాగా చదువుకుని పెద్ద ఉద్యోగస్థుడయేవాడు. అతడి తెలివీ నిదానం ముందుచూపూ ఎందుకూ పనికిరాలేదు. ఈ ప్రపంచం ఎటు వైపు నడుస్తున్నది ?"

శివయ్యను బల్లమీద పడుకోబెట్టగానే గుంపుమీద పిడుగుపడినట్లయింది ? డాక్టరటువెళ్ళగానే.

"ఎందుకు ? ఎందుకు ?" అక్కడున్నవాళ్ళంతా రుద్ధకంఠాలతో అరిచారు.

"అంతటి యోధుడిని చంపగలిగిన వాడెవడు ?" అరిచారు.

"మీరేం చేశారు ? మీరెటువెళ్ళారు" కొందరు గద్దించి అడిగారు సోమన్ననూ కామేశాన్ని.

"మేమూ తిరిగాం కొన్ని గ్రామాలు. అప్పుడప్పుడు శివయ్యను కలుసుకునే వాళ్ళం."

మీరేంచేశారు ?

"వెళ్ళినచోటల్లా చావుదెబ్బలు తిన్నాం" వీపులు షర్టుపైకెత్తిచూపించారు. అన్నీవాతల్లాదెబ్బలు చీముపట్టి నడుము వంచలేక ఎత్తలేక బాధపడుతున్నారు.

శివయ్యనూ ఆపిల్లల వీపులనూ చూసిన ప్రిన్సిపల్ తలవంచుకుని కన్నీళ్ల కార్చాడు.

"తనే హంతకుడు. తనే ప్రోత్సహించి శివయ్యలో ఆశలురేపి అతడికి బంగారు భవిష్యత్తును ఒకమెరుపులా మెరిపించి చావుకు మూలకారకుడైనాడు.

ఆయనకు మతిపోయినట్లవుతోంది.

కుప్పగా కూలిపోయాడు.

"గ్రామాలు దైన్యమైన స్థితిలో ఉన్నాయి ? ఈ సంగతి అందరికీ తెలుసు. ఆ ప్రజలలో పెరిగిన అవిశ్వాసము కొందరికే తెలుసు. మనిషిని మనిషి నమ్మడు." అన్నాడొకాయన ప్రిన్సిపల్‌ను చూస్తూ.

"కుగ్రామాలేనా ? పట్టణాలూ నగరాలూ బాగున్నాయా ? ఒకరినొకరు హింసించుకోవటంలేదూ ? తడిగుడ్డలతో ఒకరిగొంతులొకరు కోసుకోవటంలేదూ ?" వెనుకనుంచి తుపాకీ పేల్చినట్టుగా అన్నాడు.

ఆ గుంపులోనే చాలామంది భుజాలు తడుముకున్నారు.

హెడ్‌మాస్టరు టీచర్లు తలలువంచుకున్నారు.

ప్రిన్సిపల్ మతిపోయినట్టుగా బాధపడుతున్నాడు. ఆయనకు శివయ్య రాత్రిళ్ళు కలలోకివచ్చి "సర్, మీరుచెప్పినట్టు గ్రామాలు బాగుచేశాను. నాకు

కాలేజి చదువుకు స్కాలర్‌షిప్ ఇప్పించి చదువుచెప్పిస్తారా" అని అడుగుతున్నట్లనిపిస్తోంది.

"తనెందుకు గ్రామసేవ అంటూ కార్యక్రమాలను రూపొందించి, అతడిలో ఆశలురేపాడు ?"

వెంటనే ఆఫీసురూమ్ తాళాలు తీయించి బల్లముందర కూర్చుని రాజీనామా పత్రంరాసి గబగబా ఇంటికివెళ్ళాడు.